# కాంగ్రెస్‌కు ఓటేస్తే.. ఢిల్లీ నవాబులకు గులామే



బుద్దారం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గండ్ర జ్యోతి, బీఆర్ఎస్ శ్రేణులు

- రైతుబంధు కావాలా.. రాక్షస పాలనా ?
- బుద్దారం అభివృద్ధిని అడ్డుకున్న సత్యనారాయణరావు
- జడ్పీటీసీగా గణపురానికి చేసిందేమీ లేదు..
- గండ్ర వెంకట రమణారెడ్డిని గెలిపించాలి
- సీఎం కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాలకు న్యాయం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

గణపురం, నవంబర్ 15 : కాంగ్రెస్‌కు ఓటేస్తే... ఢిల్లీ నవాబులకు గులాం చేయాల్సిందేనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపు కోరుతూ బుధవారం మండలంలోని బుద్దారం, బుర్రకాయల గూడెం, కర్కపల్లి, కుందయ్యపల్లి, దుబ్బపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకుడు గండ్ర గౌతంరెడ్డితో కలిసి గండ్ర జ్యోతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసినా అభివద్ధి, ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం గండ్ర జ్యోతి మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రైతుబంధు ఆపేసి, రాక్షస పాలన తీసకువస్తారన్నారు. ఒక్కసారి అవకాశమివ్వండని మొసలి కన్నీరు కార్చే కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. బుద్దారం గ్రామ అభివృద్ధిని అడ్డుకున్నది కాంగ్రెస్ నేత గండ్ర సత్యనారాయణరావేనని, బుద్దారం గ్రామానికి హెల్త్ సబ్‌సెంటర్‌ను తీసుకువస్తే సత్యనారాయణరావు అడ్డుకున్నా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రజల ఆరోగ్యం కోసం ఆలోచించి హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారన్నారు. అలాగే బుద్దారం గ్రామానికి సైడ్ డ్రైనేజీలు, అంతర్గత సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యం, ఎస్సీ కమ్యూనిటీ హాల్ వంటి అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తీసుకువస్తే, స్థానిక సర్పంచ్‌తో తీర్మాన చేయకుండా గ్రామం అభివృద్ధి చెందకుండా అడ్డుకున్న నీచ చరిత్ర గండ్ర సత్యనారాయణదని విమర్శించారు. రెండు సార్లు జడ్పీటీసీగా చేసి గణపురం మండలానికి చేసిందేమీ లేదన్నారు. జడ్పీటీసీగా ఉన్న సమయంలో వేల క్వింటాళ్ల రేషన్ బియ్యం అమ్ముకొని పేదల కడుపుకొట్టిన చరిత్ర హీనుడు గండ్ర సత్యనారాయణరావని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే భూపాలపల్లి నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడి పోతుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో సబ్బండ వర్గాల ప్రజలు అభ్యున్నతి సాధించారన్నారు. గడిచిన 5 ఏండ్లలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాలకుడిగా కాకుండా ప్రజలకు సేవకుడిలా పని చేశారన్నారు. బీఆర్ఎస్‌ది ప్రజా సంక్షేమ పాలన అని, ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటువేసి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించి, అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఏఎంసీ చైర్మన్ పోలుసాని లక్ష్మీ నరసింహారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతే కరుణాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచంద్రారెడ్డి, సర్పంచ్‌లు కాలియా రజితా బాబు, నడిపెల్లి మధుసూదన్‌రావు, ఎంపీటీసీలు రమాదేవీ మధూకర్, ఎం శివశంకర్, బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు మేకల రజిత, ఉప సర్పంచ్ రజియా, శ్రీనివాసరావు, జెట్టి కనుకరాజు, కళ్లెపు రవీందర్, సాంబయ్య, ఆయా గ్రామల అధ్యక్ష, కార్యదర్శులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



దేవగిరిపట్నంలో మాట్లాడుతున్న సతీశ్‌రెడ్డి, చిత్రంలో నాగజ్యోతి

## బడే నాగజ్యోతిని గెలిపించుకుంటాం..

- సీతక్క బెదిరింపులకు భయపడేది లేదు
- రెడ్‌కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి

ములుగు రూరల్, నవంబర్15 : కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క బెదిరింపులకు భయపడేది లేదని, ప్రాణాలు అడ్డుపెట్టి అయినా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతిని గెలిపించుకుంటామని రాష్ట్ర రెడ్‌కో చైర్మన్, మండల ఎన్నికల ఇన్‌చార్జి ఏరువ సతీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి దేవగిరిపట్నం గ్రామంలో అభ్యర్థి నాగజ్యోతి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతక్క చేసిన అభివృద్ధిని చెప్పకుండా ఓటమి భయంతోనే బెదిరింపులకు దిగుతుందన్నారు. 20 ఏళ్ల క్రితం తన సమీప బంధువును పొట్టనపెట్టుకుందని, ఇప్పుడు తనను చంపేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ప్రాణాలకు తెగించి అయిన నాగజ్యోతిని గెలిపించుకుంటామన్నారు. డిసెంబర్ 3న జరిగే ఓట్ల లెక్కింపులో ఎవరి సంగతి ఏంటో ప్రజలు తేల్చనున్నారన్నారు. తన ప్రాణం ఉన్నంత వరకు దేవగిరిపట్నం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. గ్రామంలో రెండు ఎకరాలతో కమ్యూనిటీ హాల్ నిర్మించి ప్రతి వీధికి సీసీ రోడ్లను నిర్మించి పూరిగుడిసెలను పక్కా ఇండ్లుగా మార్చే బాధ్యత తీసుకుంటానని అన్నారు. సీఎం కేసీఆర్, బడే నాగజ్యోతి సహకారంతో గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు ములుగు ప్రాంత ప్రజలు కానుకగా అందించాలని కోరారు.

## ఎలక్షన్ల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు పూర్తి
- సీ విజిల్, 1950 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ
- జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి భవేశ్‌మిశ్రా

భూపాలపల్లి రూరల్, నవంబర్ 15 : అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి కలెక్టర్, ఎన్నికల అధికారి భవేశ్‌మిశ్రా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎన్నికల పరిశీలకులు అభయ్ నందన్ అభస్తా, కౌశిక్ రాయ్, అమిత్ కుమార్‌లతో కలిసి ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం జిల్లాలోని 317 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన పూర్తి చేశామని తెలిపారు. ఎన్నికల కమిషన్ 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించిందని తెలిపారు. నవంబర్ 18న బ్యాలెట్ పేపర్ ముద్రణ జరుగుతుందని, అనంతరం రిటర్నింగ్ అధికారి సదరు ఓటర్ల ఇంటి నుంచి ఓటు హక్కు స్వీకరించేందుకు బృందాలు వస్తాయన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సైతం హాజరు కావచ్చని తెలిపారు. 13 రకాల అత్యవసర సేవా విభాగంలో పనిచేసే వారికి, ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు సౌకర్యం కల్పించిందని, వారి వివరాలను సైతం రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేస్తామన్నారు. పోటీలో 15 కంటే ఎక్కువ మంది అభ్యర్థులు ఉంటే అదనపు బ్యాలెట్ యూనిట్ అవసరం ఉంటుందన్నారు. మరోసారి ఈవీఎం లను ర్యాండమైజేషన్ చేయాలని సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వీఐపీల ప్రచారం కోసం హెలిపాడ్ వినియోగించుకోవడానికి 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవనర్తన నియమావళి ఉల్లంఘనలపై సీ-విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎన్నికల ఖర్చు వివరాలు జిల్లాలో నిర్దేశించిన రేట్ చార్ట్ ప్రకారం నమోదు చేస్తామన్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సైతం అభ్యర్థుల ఖాతాల్లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

# ఎన్నికల ప్రశాంత నిర్వహణకు చర్యలు తీసుకోవాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు సవిన్ బన్సల్

- ఎన్నికల నిబంధనల ప్రకారం పనిచేయాలి
- ఓటర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలి
- ఎన్నికల పరిశీలకుడు సవిన్ బన్సల్

ములుగు టౌన్, నవంబర్15 : అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఎన్నికల టీములు చర్యలు తీసుకోవాలని ములుగు అసెంబ్లీ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకుడు సవిన్ బన్సల్ సూచించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల పోలీస్ పర్యవేక్షకుడు అంజన్ చక్రబోర్తి, ఎన్నికల వ్యయ పరిశీలకుడు వాగీశ్ కుమార్ సింగ్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి, ఎస్పీ గౌస్ ఆలంలతో కలిసి నోడల్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని నోడల్ టీం సభ్యులు ఎన్నికల నిబంధనల ప్రకారం పనిచేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని తాగు నీరు, టాయిలెట్, కరెంట్ సౌకర్యం, దివ్యాంగుల కోసం ప్రత్యేక ర్యాంపులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నూతన ఓటర్లకు ఓటు వేసే ప్రక్రియ అర్థమయ్యే లా ఓటర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు, ఈవీఎం వినియోగంపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద తప్పనిసరిగా దివ్యాంగుల కోసం ర్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఎన్నికలలో విద్వేష ప్రసంగాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘున, డబ్బు, మద్యం పంపిణీ, ఇతర ఉల్లంఘనలపై సీ విజిల్ యాప్, 1950 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుడి ఫోన్ నెంబర్, వివరాలు గోప్యంగా ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలు జిల్లాలో నిర్దేశించిన రేట్ చార్ట్ ప్రకారం నమోదు చేయడం జరుగుతుందని, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సైతం అభ్యర్థుల ఖాతాలో నమోదు చేయడం జరుగుతుందని, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసే వీడియో, ఆడియోలకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చని సాధారణ ఎన్నికల పరిశీలకుడు సవిన్ బన్సల్ 8500275774, ఎన్నికల వ్యయ పరిశీలకుడు వాగీశ్ కుమార్ సింగ్ 8500275692, ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై, ఎన్నికల పోలీస్ పర్యవేక్షకుడు అంజన్ చక్రబోర్తి 8712670126 మొబైల్ నంబర్లకు ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అబ్జర్వర్లు జిల్లాలోనే ఉండి పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాం, కౌంటింగ్ హాళ్లను పరిశీలించారు. ఈ సమావేశంలో ఓఎస్డీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ డీ వేణు గోపాల్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ సదానందం, అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులు దళారులను ఆశ్రయించొద్దు

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు
- సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

భూపాలపల్లి రూరల్, నవంబర్ 15 : రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని అదనపు కలెక్టర్ కే వెంకటేశ్వర్లు అన్నారు. భూపాలపల్లి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైతులు పత్తిని బాగా ఆరబెట్టి 12 శాతం లోపు తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. కాయ పత్తి లేకుండా శుభ్రపరచి మిల్లులకు తరలించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7020 పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఐ అధికారులు, మార్కెటింగ్ అధికారులు, మిల్లుల యాజమాన్యం పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గణపురం, నవంబర్ 15 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మచ్చ సాంబమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరగాళ్లు స్మార్ట్‌ఫోన్ వినియోగదారులకు వల వేస్తున్నారన్నారు. పార్టుటైం జాబ్‌లు, వర్క్‌ఫ్రం హోమ్ అని చెప్పి టెలిగ్రాం, వాట్సాప్, ఇన్‌స్టా గ్రామ్‌లో మెసెజ్‌లో పంపిస్తున్నారన్నారు. వాటికి లైక్, రేటింగ్ ఇచ్చినా, మెసేజ్ పెడితే డబ్బులు వేస్తామనే వాటి జోలికిపోవద్దన్నారు. అలాగే లోన్లు ఇస్తామని, ఓఎల్ఎక్స్, ఆర్మీ ఆఫీసర్లమని చెప్పి తప్పుడు లింకులు పెడతారనీ ప్రజలు వాటి జోలికి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.